వెంకన్నసేవలో పివి.సింధు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల వెంకటేశ్వర స్వామిని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు దర్శించుకున్నారు. వివాహమై ఏడాది పూర్తయినందున శ్రీవారిని దర్శనానికి వచ్చానని తెలిపారు.ఆమె మీడియాతో మాట్లాడుతూ.. బ్యాడ్మింటన్ రంగంలో బాగా రాణించాలని వేడుకున్నానని, వచ్చే ఏడాది ఇండోనేషియా, మలేషియా, ఇండియాలో టోర్నమెంట్లు ఉన్నాయని తెలియజేశారు. విశాఖలో అకాడమీ నిర్మాణం జరుగుతోందని.. మంచి పేరు రావాలని ప్రార్థించానని పివి సింధు పేర్కొన్నారు.

భజరంగ్‌దళ్ దాడులకు వెనక్కి తగ్గేదేలే..

కేక్‌కట్ చేసి క్రిస్మస్ సంబరాలు

ప్రజాశక్తి - క్యాంపస్

లౌకిక విలువలు ప్రతిబింబించేలా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిపాలన భవనం ఎదుట కేకులు కోసి క్రిస్మస్ వేడుకలను విద్యార్థిసంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. రాబోయే సంక్రాంతి సంబరాలను ఇదే ఐక్యతతో ఘనంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో లౌకిక విలువలు ప్రతిబింబించేలా అన్ని మతాలకు చెందిన విద్యార్థులు పరిపాలన భవనం ఎదుట కలిసి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో-కన్వీనర్ అశోక్ కుమార్, వైఎస్ఆర్ విద్యార్థి విభాగం వర్సిటీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, నెల్సా వ్యవస్థాపకుడు సుందర్ రాజు, పీడీఎస్యూ జిల్లా కార్యదర్శి లోకేష్, ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షుడు శివబాలాజీ, ఏపీ విహెచ్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ముని మాట్లాడారు. విశ్వవిద్యాలయం ప్రభుత్వ నిధులతో నడుస్తుందని, ఇక్కడ అన్ని మతాలు సమానమని వారు స్పష్టం చేశారు. మైనారిటీలపై భజరంగ్ దళ్ వంటి సంఘాల కార్యకర్తలు దాడులకు దిగితే భయపడే ప్రసక్తి లేదని, రాబోయే రోజుల్లో అన్ని మతాలకు సంబంధించిన పండుగలను విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహిస్తూ ఐక్యతను చాటుతామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి ప్రతి జిల్లాలోనూ సెమీ-క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారని, కానీ విశ్వవిద్యాలయ అధికారులు అయిన వీసీ, రిజిస్ట్రార్, రెక్టర్‌లు మాత్రం కేవలం ఒక మతానికి సంబంధించిన కార్యక్రమాలకు మాత్రమే హాజరవుతున్నారని విమర్శించారు. స్వయానా శ్రీ వెంకటేశ్వర స్వామి రెండవ భార్య బీబీ నాంచారి ఒక ముస్లిం మహిళ అని గుర్తుచేస్తూ, అలాంటి చారిత్రక నేపథ్యం ఉన్న విశ్వవిద్యాలయంలో అన్ని మతాలకు సంబంధించిన కార్యక్రమాలకు అధికారులు ఎందుకు హాజరు కావడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వర్సిటీ కార్యదర్శి వినోద్, గర్ల్స్ కన్వీనర్ పవిత్ర, నాయకులు ప్రకాష్, మహేష్, మణి, తిప్పేస్వామి, విజయ్, యుగంధర్, అనిత, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

శ్రీనివాస హైస్కూల్లో...

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం పరిధిలోని శ్రీనివాస ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో బుదవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించిన్నట్లు పాఠశాల కరెస్పాండెంట్ వి.సుబ్రమణ్యం రాజు తెలిపారు. ఈ సందర్భంగా క్రిస్మస్ పండుగ విశిష్టితను విద్యార్థులకు ఆయా వేషదారణలు కట్టించి తెలిపామన్నారు. ఇవేకాకుండా తెలుగు పండుగలు, మన సంస్కృతి సాంప్రదాయాలు తెలియజేస్తున్నామన్నారు. పాఠశాల డైరెక్టర్ వి.మంజుల పాల్గొన్నారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మిద్దెల హరి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ ప్రజలందరికీ మాజీ ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్, మాజీ ఆప్కో డైరెక్టర్ మిద్దెల హరి బుధవారం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకోవాలని అన్నారు. ఏసుక్రీస్తు ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రేమ, దయ, శాంతి గుణాలు అలవర్చుకోవాలని సూచించారు.

ఎంజిఎంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

స్థానిక ఎంజీఎం స్కూల్లో బుధవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ క్రిస్మస్ పర్వదిన ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు శాంతా క్లాస్ వేషధారణలో అలరించారు. ప్రధానోపాధ్యాయులు ముని రత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుండె వైద్యంలో ఆస్టర్ నారాయణాద్రి కీలక మైలురాయి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతిలోని ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ హదయ వైద్యంలో మరో కీలక మైలురాయిని సాధించింది. అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న 80 ఏళ్ల వద్ద రోగికి టీఏవిఐ/టీఏవిఆర్ (ట్రాన్సకాతేటర్ అర్టిక్ వాల్వ్ ఇంప్లంటేషన్ / రీప్లేసెమెంట్) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి, రాయలసీమ ప్రాంతంలోనే అత్యాధునిక ట్రాన్స్‌కాథెటర్ హదయ వాల్వ్ చికిత్సలను అందుబాటులోకి తీసుకొచ్చామని ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ముని తెలిపారు. స్థానిక రేణిగుంట రోడ్డు లోని ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌లో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్ సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బందం, 24/7 క్రిటికల్ కేర్ మద్దతు వల్ల ఇలాంటి క్లిష్టమైన హదయ చికిత్సలు సాధ్యమయ్యాయి. మెట్రో స్థాయి వైద్య సేవలను రాయలసీమ ప్రజలకు అందించడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అభిషేక్ కాశా మాట్లాడుతూ "అధిక వయస్సు, హై రిస్క్ ఉన్న రోగులకు టీఏవిఐ/ టీఏవిఆర్ శస్త్రచికిత్స ఒక వరం లాంటిది. ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా, ఆధునిక సాంకేతికతతో ఈ చికిత్సను విజయవంతంగా నిర్వహించగలిగాం. తిరుపతిలో ఈ స్థాయి చికిత్స అందుబాటులోకి రావడం హదయ వైద్య రంగంలో ఒక కొత్త అధ్యాయం" అని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సునంద కుమార్ రెడ్డి, డాక్టర్ ఎస్.వి. ప్రసాద్, చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ ప్రతిమ, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి సుమంత్ రెడ్డి, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రాకెట్ విజయవంతంతో షార్‌లో సంబరాలు

భళా..'బాహుబలి' ..!

షార్‌లో సంబరాలు...

ప్రజాశక్తి -సూళ్లూరుపేట

ఇస్రో చేపట్టిన బాహుబలి రాకెట్ ఎల్‌విఎం3ఎం6 ప్రయోగం విజయవంతమైంది. బుధవారం ఉదయం 8.55 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ఇస్రో ఈ బాహుబలి రాకెట్ లాంచ్ వెహికల్ మార్క్ 3 ఎం 6 విజయవంతంగా ప్రయోగించింది. అమెరికాకు చెందిన భారీ కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూ బర్డ్ బ్లాక్ 2ను రాకెట్ మోసుకెళ్లింది. 15.30 నిమిషాల్లో మూడు దశల్లో రాకెట్ ప్రయోగం విజయవంతం అయింది. అమెరికాకు చెందిన ఏఎస్టి స్పేస్ మొబైల్ సంస్థ తో కలిసి ఇస్రో వాణిజ్య విభాగం న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని నిర్వహించింది. సుమారు 6,100 కిలోల బరువున్న ఈ ఉపగ్రహం ఇస్రో ఇప్పటివరకు ప్రయోగించిన అత్యంత బరువైన వాణిజ్య పేలోడ్ గా రికార్డు సష్టించింది. దీంతో ఇస్రో కేంద్రంలో సంబరాలు మొదలయ్యాయి. భవిష్యత్తులో మరిన్ని వాణిజ్య ప్రయోగాలు చేపడతామని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ చెప్పారు. ప్రయోగం విజయవంతం కావడానికి అహర్నిశలు కషిచేసిన శాస్త్రవేత్తలను ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ అభినందించి,శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి, శ్రీసిటీ ఎండి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అభినందనలు తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్ కొడుక్కి ఉద్యోగం ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - రేణిగుంట

రేణిగుంట గ్రామ పంచాయతీలో పదేళ్లుగా ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగపట్ల చిన్ని (57) లారీ ఢీకొని యాక్సిడెంట్‌లో మృతిచెందడం బాధాకరమని సిఐటియు నాయకులు ఒ.వెంకటరమణ, కొండ్రెడ్డి హరినాథ్, సెల్వరాజ్, కుప్పస్వామి, కొండ్రెడ్డి ఈశ్వరమ్మ నివాళి అర్పించారు. కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విధి నిర్వహణలో మృతిచెందిన నాగపట్ల చిన్ని చిన్నకొడుక్కు పర్మినెంట్ ఉద్యోగం ఇచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబానికి ఆర్థిక సాయం కింద రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

వైకుంఠ ఏకాదశికి పటిష్టమైన భద్రత : కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని తిరుమలతో పాటు తిరుపతి, జిల్లాలోని ఇతర దేవాలయాలలో భక్తుల సౌకర్యం, శాంతి భద్రతల పరిరక్షణ దష్ట్యా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ యస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా సుమారు 3000 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరుమలలో రియల్ టైమ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సీసీ కెమెరాలతో, తిరుపతిలోని బస్టాండ్, అలిపిరి, శ్రీవారి మెట్లు తదితర ముఖ్య ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతున్నట్లు వెల్లడించారు. ఈ సంవత్సరం మొదటి మూడు రోజులకు భక్తులకు ఎలక్ట్రానిక్ డిప్ విధానం ద్వారా టోకెన్లు జారీ చేయడం జరిగిందని, దీనిని ఆసరాగా చేసుకుని కొందరు నకిలీ టోకెన్లు జారీ చేసి భక్తులను మోసం చేస్తున్నారని తెలిపారు. నకిలీ టోకెన్లతో వచ్చిన భక్తులకు అనుమతి ఉండదని, నకిలీ టోకెన్లు ఇచ్చినవారిపైనా, తీసుకొచ్చిన వారిపైనా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిసెంబర్ 30, 31, జనవరి 1 తేదీల్లో ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా టోకెన్ పొందిన భక్తులు తప్పనిసరిగా నిర్దిష్ట సమయం, నిర్దిష్ట ప్రదేశానికి మాత్రమే హాజరు కావాలని సూచించారు. భక్తులు సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని, టీటీడీ అధికారిక మాధ్యమాల ద్వారా మాత్రమే సమాచారం తెలుసుకోవాలని తెలిపారు, తప్పుడు సమాచారం ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోరచారి, శ్రీనివాసులు, డిఎస్పీలు వెంకటనారాయణ, భక్తవత్సలం, రామకృష్ణాచారి, రమణారావు, చందరశేఖర్ పాల్గొన్నారు.

యస్వీయూ పరిసరాల్లో ప్రైవేటు బ్యానర్లు, వ్యక్తులు నిషిద్ధం : రిజిస్ట్రార్

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పరిసరాల్లో ప్రైవేట్ బ్యానర్లు, వ్యక్తులు నిషిద్ధమని రిజిస్ట్రార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కాలంలో విశ్వ విద్యాలయం లోపల, బయట ప్రైవేట్ సంస్థలు, రాజకయ పక్షాలకు చెందిన జన్మదినాలకు సంబంధించిన ఫ్లెక్సీలు పెరిగిపోతున్నాయన్నారు. విశ్వ విద్యాలయం ప్రాంగణంలో ప్రైవేట్ సంస్థల సమావేశాలు, బ్యానర్లు పెట్టరాదని సూచించారు. బైట వ్యక్తులకు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోకి అనుమతి లేదన్నారు. అలాగే హాస్టళ్లలో నివసించినా , అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందినా విశ్వవిద్యాలయం పక్షాన కఠిన చర్యలుంటాయి. లోపల,బయటి వ్యక్తులు యస్వీయూ ప్రాంగణంలో చట్టవ్యతిరేక కార్యక్రమాలు పాల్పడితే పోలీసు చర్యలు ఉంటాయని తెలిపారు.

పల్లెపండుగ 1.0 నిధులు విడుదల

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

పల్లె పండుగ 1.0లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ.58.39 కోట్లు విడుదల చేసినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ నుండి డిసెంబర్ మధ్య కాలంలో జరిగిన మెటీరియల్ కాంపోనెంట్ పనులకు 60 కోట్లు ఇప్పటికే విడుదల అయ్యాయన్నారు. పల్లె పండుగ 1.0లో సిసి రోడ్ల నిర్మాణానికి రూ.41.50 కోట్లు, బీటిరోడ్లకు రూ.2.88 కోట్లు, పశువుల షెల్టర్లకు రూ.6.14 కోట్లు, కంపోస్ట్ గుంతలకు రూ.1.25 కోట్లు, ప్లాంటేషన్ కు రూ.0.75 కోట్లు ఇతర పనులకు రూ.5.87 కోట్లు విడుదల అయ్యిందన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రసాయన రహిత ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దామని శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం వ్యవసాయ, వెలుగు శాఖల అధికారులతో రంగినేని చెంచయ్య నాయుడు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై సుదీర్ఘంగా చర్చించారు. సహజ సిద్ధమైన ఎరువుల తయారీ, పంటల సాగుపై ఏడిఏ రమేష్ రెడ్డి వివరించారు. ఏపీఎం నరసింహులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

శివుని ఆదాయం రూ.1.31 కోట్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి స్వామీ అమ్మవార్లు, పరివార దేవతలకు భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం ఒక కోటీ 31 లక్షలా 65 వేలా 590 రూపాయలు వచ్చింది. స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు జరిగింది. బంగారం 0.25 గ్రాములు, వెండి 352.150 కిలోలు, 71 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు.

తిరుపతిలో ఐఐఎం ఏర్పాటు చేయాలి: ఎంపీ

ప్రజాశక్తి తిరుపతి సిటీ

తిరుపతి నగరంలో ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్' (ఐఐఎం) ఏర్పాటు చేయాలని తిరుపతి పార్లమెంటు సభ్యులు డాక్టర్ మద్దిల గురుమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాశారు. దేశవ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలను విస్తరించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా తిరుపతిలో ఐఐఎం ఏర్పాటు చేయాలని ఆ లేఖలో ఎంపీ విజ్ఞప్తి చేశారు. ఉన్నత విద్యను బలోపేతం చేయడం, ప్రాంతీయ సమతుల్య అభివద్ధిని సాధించడం, అలాగే సమగ్ర వద్ధిని ప్రోత్సహించడంలో ఈ ప్రతిపాదన ఎంతో కీలకమని ఎంపీ తన లేఖలో పేర్కొన్నారు.

త్రోబాల్ మహిళా ఉపాధ్యాయులకు అభినందనలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాస్థాయిలో మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు జరిగాయి. కెవిబిపురం మండలం జడ్‌పి హైస్కూల్ రాగిగుంటలో నిర్వహించారు. ఈ పోటీల్లో తిరుపతి అర్బన్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల మహిళా ఉపాధ్యాయులు జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అర్బన్ మండల విద్యాశాఖాధికారులు కె.బాలాజీ, బి.భాస్కర్‌నాయక్‌లు విజేతలను అభినందించారు. త్రోబాల్ పోటీల్లో రాణించిన ఆరుగురిని రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యారు. డి.జ్యోతి, డి.హేమలత, డి.నాగవేణి, బి.మహేశ్వరి, పి.సరోజిని, సునీత రాష్ట్రస్థాయిలో జనవరిలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. యుటిఎఫ్ నాయకులు బండి మధుసూదన్‌రెడ్డి, ఎస్.మోహన్, ఎస్.ఖాదర్‌బాష, ప్రభుకుమార్, ఎస్‌టియు నాయకులు మునికృష్ణనాయుడు, రేణుకాదేవి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎంజిఎం హైస్కూల్ పి.విజయకుమారి పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లను బలవంతంగా బిగించొద్దు : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

ప్రజలపై భారాలు మోపి అదానీకి లాభాలు చేకూర్చే స్మార్ట్ మీటర్లను వెంటనే నిలిపివేయాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయం తీసుకోకుండా, పూర్తి సమాచారం ఇవ్వకుండా కార్పోరేట్ లాభాల కోసం ఈ మీటర్లను బలవంతంగా అమలు చేయడం ప్రజాస్వామ్యవిరుద్ధమన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కేంద్ర ప్రభుత్వ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం యథాతథంగా అమలు చేయడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు.విద్యుత్ లాభాల కోసం అమ్మే సరకు కాదని, అది ప్రజల మౌలిక హక్కు అని అన్నారు. మారుతీనగర్ ప్రాంతంలో కొంతమంది ప్రజల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు బిగించడానికి సామాగ్రితో సహా దిగి బిగిస్తుండగా ప్రజలందరూ వ్యతిరేకించడంతో అక్కడనుంచి వెళ్లిపోయారన్నారు. మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని, విద్యుత్ భారాల నుంచి బయట పడాలన్నారు.

రేపు భారతీయ విజ్ఞాన సమ్మేళనం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఈ నెల 26 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారతీయ విజ్ఞాన సమ్మేళన కార్యక్రమానికి హాజరుకానున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లలో చిన్నపాటి లోపాలకు తావివ్వరాదని కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు సిఎం పర్యటన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, డి ఆర్ ఓ నరసింహులు, అడిషనల్ ఎస్పీలు, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ 26 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారతీయ విజ్ఞాన సమ్మేళన కార్యక్రమానికి రానున్నారని, ముందుగా ఉదయం 9.50 గంటలకు ఎస్వీ అగ్రికల్చర్ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ కు చేరుకుని అనంతరం రోడ్డు మార్గాన 10.20 గంటలకు జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయంలో జరిగి భారతీయ విజ్ఞాన సమ్మేళన కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 12.35 గంటలకు డిస్ట్రిక్ పోలీసు ఆఫీసుకు చేరుకుని ప్రారంభోత్సవం చేస్తారన్నారు. సిఎం పర్యటించే ప్రదేశాలలో ఎక్కడా గుంతలు ఉండే రోడ్డు ఉండరాదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మౌర్య, ఆర్డీవో రామ్మోహన్, డిపిఒ సుశీలదేవి పాల్గొన్నారు.

హాజరుకానున్న సిఎం చంద్రబాబు

రేపటినుంచి అన్నమయ్య సాహిత్యంపై జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్

తిరుపతిలోని ఎస్ వి ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగంలో అన్నమయ్య సాహిత్యం - ఆధ్యాత్మికత అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. ఈనెల 26, 27 తేదీల్లో రెండు రోజులపాటు కొనసాగే ఈ జాతీయ సదస్సులో వివిధ ప్రాంతాలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, సాహిత్యవేతలు పరిశోధన పత్రాలు సమర్పిస్తారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు అన్నమాచార్య సంకీర్తన కచేరితో జాతీయ సదస్సు ప్రారంభం కానుంది. 10 గంటలకు ప్రారంభ సభ జరగనుంది. ప్రిన్సిపల్ వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సభలో ఎస్వీ తెలుగు విశ్రాంతి ఆచార్యులు గార్లపాటి దామోదర్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటారు. బెంగళూరు యూనివర్సిటీ తెలుగు విశ్రాంతాచార్యులు కొలకలూరి ఆశాజ్యోతి కీలకోపన్యాసం చేస్తారు. టీటీడీ డీఈఓ వెంకట సునీల్, అన్నామాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ లత అతిథులుగా పాల్గొంటారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సమాపనోత్సవం నిర్వహిస్తారు. ఇందులో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయ్ కుమార్, అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు ప్రొఫెసర్ సదాశివరెడ్డి, అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ లత అతిథులుగా పాల్గొంటారు. సదస్సులో పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి సర్టిఫికేట్, జ్ఞాపిక, శాలువాతోసత్కరిస్తారు. ఈ మేరకు ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి, తెలుగు విభాగాధిపతి, జాతీయ సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎన్. భీమన్న తెలిపారు.

గిరిజన కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి జిల్లా పరిధిలోని సూళ్ళూరుపేట మండలం, కడపత్ర పంచాయతీ పాటిమిట్ట గిరిజన కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని ఎన్ని సార్లు అర్జీలు ఇచ్చినా అధికారులు స్పందించలేదని, మౌలిక వసతులు కల్పించాలని ఇక్కడి నివాసితులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 29న ఆమరణ దీక్ష చేస్తున్నట్లు యానాదుల(గిరిజన) సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తలపల చెంచు మల్లిఖార్జున రావు తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన అక్కడి గిరిజన కాలనీల నివాసితులతో కలిసి మాట్లాడారు. గత నాలుగు తరాలుగా ఆదే ప్రాంతంలో 26 గిరిజన కుటుంబాలు నివాసాలు కలిగి జీవనం సాగిస్తున్నారన్నారు. రోడ్డు మార్గం లేదని, విద్యార్థులు పాఠశాలకు వెళ్ళాలన్నా ఇబ్బందులు పడుతున్నారని, చివరికి చనిపోతే శవాన్ని తీసుకెళ్లడానికి అవస్థలు పడుతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. మౌళిక వసతులు కల్పించే వరకు ఆమరణ దీక్ష విడువమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో చెంగ్రాయులు, శ్రీనివాసులు, కల్పన తదితరులు పాల్గొన్నారు.

పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని పేదల ఆందోళన

ప్రజాశక్తి -సూళ్లూరుపేట

సూళ్లూరుపేట పట్టణంలోని సూళ్లూరు ప్రాంతంలో పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు బుధవారం ఆందోళనకు దిగారు.గత వందేళ్లుగా తాత ముత్తాతల కాలం నుంచి ఇదే ప్రాంతంలో నివసిస్తూ జీవనం కొనసాగిస్తున్న పేద కుటుంబాలకు ఇప్పటివరకు సర్టిఫికెట్లు జారీ చేయలేదని వారు ఆరోపించారు. ఇంటి పన్ను, నీటి పన్ను, విద్యుత్ మీటర్లు, సిసి రోడ్లు వంటి మౌలిక వసతులు ఉన్నప్పటికీ తాము నివసిస్తున్న భూములను ఇతరుల పట్టా భూములుగా చూపిస్తూ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. పొజిషన్ సర్టిఫికెట్లు ఉన్నప్పుడే కాలనీ ఇండ్లు మంజూరు చేస్తామని అధికారులు చెప్పడంతో తమ భవిష్యత్తుపై ఆందోళన నెలకొందని తెలిపారు. సుమారు 34 ఎకరాల విస్తీర్ణంలో 3వేల కుటుంబాలు నివసిస్తున్న ఈ ప్రాంత సమస్యను పరిష్కరించాలని బాధితులు అధికారులను కోరారు.

క్యాట్ ఫలితాల్లో 'కౌటిల్య' టాప్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

దేశ వ్యాప్తంగా విడుదల చేసిన జాతీయ స్థాయి క్యాట్ (కామన్ అడ్మిషన్ టెస్ట్) ఫలితాలలో తిరుపతి ఎమ్.ఆర్. పల్లి సర్కిల్ వద్ద వున్న కౌటిల్య ఇన్స్టిట్యూషన్' కి చెందిన విద్యార్థులు టాప్ స్కోర్ సాధించారు. వీరిలో ద్వారకచర్ల సందీప్ రెడ్డి 93.18 పెర్సెన్టైల్ స్కోర్ సాధించాడు. వీరితో పాటు మరి కొంత మంది విద్యార్థులకు మంచి పెర్సెన్టైల్ స్కోర్స్ సాధించారు. టాపర్లను కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్, ఫ్యాకల్టీ లు -ఎన్.హరి, సీనియర్ మేనేజర్ ఎన్.ఎస్.రెడ్డి అభినందించారు. శ్రీధర్ మాట్లాడుతూ క్యాట్ పరీక్షను ఐ.ఐ.ఎమ్ (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్)- కోజికోడ్ చే నవంబర్ 30న దేశవ్యాప్తంగా నిర్వహించారు. మొత్తం 2.58 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. ఈ 'క్యాట్' అనేది ఇండియాలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అత్యంత ప్రతిష్టాత్మక 22 ఐ.ఐ.ఎం.(ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ మేనేజ్ మెంట్) కాలేజీ లలో (ఐ.ఐ.ఎం - అహ్మదాబాద్, బెంగళూరు, కలకత్తా మొదలైనవి), ఐ.ఐ.టి లలో మరియు టాప్ బిజినెస్ స్కూల్స్ లో ఎం.బి.ఏ చేయటానికి అర్హత పరీక్ష. ఈ కాలేజీ లలో చదివిన వారికి కోటి రూపాయల వరకు అత్యధిక వార్షిక వేతనాలు లభించే అవకాశం కూడా ఉంటుందని వెల్లడించారు. "గత 15 సంవత్సరాలుగా కౌటిల్య కోచింగ్ ద్వారా అనేక వందల మంది విద్యార్థులు జాతీయ స్థాయి లో టాపర్లు గా నిలిచి, ప్రముఖ ఐ.ఐ.ఎం లలో (ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ మేనేజ్ మెంట్- అహ్మదాబాద్, బెంగళూరు, కలకత్తా)లో ఎం.బి.ఏ సీట్లు సాధించారు' అని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఈ క్యాట్ పరీక్ష కు సంబంధించి, ఉచిత గైడెన్స్ కోసం కౌటిల్య సంస్థను 9698123456 కు ఫోన్ లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరుకు ప్రాధాన్యం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని 9 జిల్లాల్లో వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరుకు ప్రాధాన్యతనివ్వాలని ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి సూచించారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎండి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 45 వేల వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేశామని, ఈ డిసెంబర్ 31వ తేదీలోగా మరో 5 వేల వ్యవసాయ విద్యుత్ సర్వీసులను విడుదల చేయడం ద్వారా 50 వేల సర్వీసుల మార్కును చేరుకోవాలని అధికారులకు సూచించారు.

రూఫ్ టాప్ సోలార్ పై అవగాహన

సంస్థ పరిధిలో సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా రూఫ్ టాప్ సోలార్ సిస్టం పై వినియోగదారుల్లో అవగాహనను పెంపొందించాలని సిఎండి సూచించారు. కేవలం ఎస్సీ, ఎస్టీ గ హ వినియోగదారులకు మాత్రమే కాకుండా, ఎస్సీ ఎస్టీయేతర వినియోగదారులు కూడా సోలార్ విద్యుత్ వైపు మొగ్గు చూపే విధంగా అధికారులు ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. ఈ ప్రణాళికలో భాగంగానే సోలార్ విద్యుత్తు వినియోగంపై ఆసక్తి ఉన్న వినియోగదారులను గుర్తించి, రూఫ్ టాప్ సోలార్ సిస్టం ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 'కరెంటోళ్ళ జనబాట' కార్యక్రమం జరిగిన తీరుపై సంస్థ పరిధిలోని 9 జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో జరిగే ఈ కార్యక్రమాన్ని మరింత మెరుగ్గా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి. అయూబ్ ఖాన్, కే. గురవయ్య, కే. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జే. రమణాదేవి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్రభుత్వ కాల్వ పోరంబోకు స్థలం కబ్జా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఆక్రమణలను అడ్డుకున్న విఆర్వో ప్రసాద్, సిబ్బంది

మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీ చెన్నాయిగుంట గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబర్ 222లోని 5వ సబ్ డివిజన్‌లో గల ప్రభుత్వ కాలువ పోరంబోకు ఎకరా 10 సెంట్లు స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమణలు చేయడానికి పూనుకున్నారు. ఇటీవల కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సాక్ష్యాత్తు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి జిల్లా పరిధిలో భూ ఆక్రమణలు, క్రిమినల్ నేరాలు ఎక్కువవుతున్నాయని ప్రస్తావించడం జరిగింది. వాస్తవికంగా రాజకీయజోక్యాలతో అధికారులు తీవ్ర ఒత్తిళ్ళకు గురిఅవుతున్నారని సీఎంకు సమాచారం చేరింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూముల రక్షణకు అధికారులు నడుంబిగించారు. 222లోని 5వ సబ్‌డివిజన్‌లో ప్రభుత్వ కాలువ పోరంబోకు స్థలం కబ్జా విషయాన్ని తెలుసుకున్న తిరుపతి అర్బన్ తాహశీల్దార్ సురేష్ బాబు వెంటనే ఆక్రమణలు అడ్డుకోవాలని విఆర్వో ప్రసాద్‌ను ఆదేశించారు. విఆర్వో ప్రసాద్, సర్వేయర్ రమేష్‌తో కలిసి కబ్జా ప్రాంతానికి వెళ్ళి ఆక్రమణలను అడ్డుకున్నారు. ప్రభుత్వ భూములను ఎవరైన ఆక్రమించాలని చూస్తే కఠినంగా వ్యవహరిస్తాం. క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం అన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

వాకాడులో

ప్రజాశక్తి- వాకాడు: వాకాడు మండలం కొండా పురంలో బుధవా రం బెరాక చర్చిలో ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టిడిపి నాయకులు గోపి నాయుడు, వైసిపి వాకాడు మండల ఇన్‌ఛార్జి ఏనుగు సుధాకర్ నాయుడు దంపతులు పాల్గొన్నారు. సంఘ కాపరులు నాయకులను సత్కరించి, మహిళలకు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బెరాక సంఘ కాపరులు నోవాబాబు, డాక్టర్ సరస్వతమ్మ, క్రైస్తవులు పాల్గొని ప్రజలకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని విద్యాస్ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో డైరెక్టర్ విద్యాప్రకాష్ రెడ్డి అధ్యక్షతన ప్రిన్సిపాల్ మేరీ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ మన అందరినీ మానవత్వ సేవలో ప్రేరేపిస్తు, మెరుగైన భవిష్యత్తు కోసం ప్రేరణ ఇస్తుందని, సాటి మనిషిపై ప్రేమ, కరుణ, దాతృత్వం, త్యాగం తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలు అని బియన్ కండ్రిగ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు , మండల ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు శాంటక్లాజ్, ఏంజెల్స్ వేషధారణతో అలరించి, తోటి విద్యార్థులను ఆనందింపచేశారు. అనంతరం స్వీట్లు, చాక్లెట్స్ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో విద్యాస్ వికాస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణంలోని నారాయణ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా, ఉత్సాహంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి యాజమాన్యం డీజీఎం కొండలరావు, తిరుపతి రీజియన్ ఏజీఎం డాక్టర్ శ్రీనివాసులు, పాస్టర్ ఇమ్మన్యుయేల్ బాబు , ఆర్ఐ కిరణ్ కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వీరితో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి , ఏవో రాజేష్, ఉపాధ్యాయ బృందం సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు, పాస్టర్, యాజమాన్య సిబ్బంది కార్యక్రమం ప్రారంభంలో మాట్లాడుతూ క్రిస్మస్ ప్రాధాన్యతను వివరించారు. యేసుక్రీస్తు బోధించిన ప్రేమ, శాంతి, కరుణ, సోదరభావం వంటి విలువలను విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు క్రిస్మస్ గీతాలు, నృత్యాలు, నాటికలు ప్రదర్శించి అందరినీ అలరించారు. పాఠశాల ప్రాంగణాన్ని క్రిస్మస్ అలంకరణలతో శోభాయమానంగా అలంకరించారు. శాంటా క్లాజ్ వేషధారణలో విద్యార్థులు సందడి చేస్తూ చిన్నారులకు బహుమతులు పంపిణీ చేశారు. క్రిస్మస్ పండుగ ద్వారా విద్యార్థుల్లో మానవ విలువలు, సానుకూల ఆలోచనలు పెంపొందుతాయని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను, ఐక్యతను పెంచుతాయని అన్నారు. చివరగా పాస్టర్ ప్రార్థనతో కార్యక్రమాన్ని ముగించారు.

ఘనంగా జాతీయ వినియోగదారుల దినోత్సవం

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం జాతీయ వినియోగ దారుల వారోత్స వాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో ముని సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన, వక్తృత్వం, మాక్ షాప్ కృత్యం, నినాదాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్ధాలపై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండ ల పరిధిలోని విందూరు గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రంలో ఐసిడి ఎస్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి , బేటి బచావో, బేటి పడావోను నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరీ మాట్లాడుతూ బాలికల విద్య, మహిళా చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపరు వైజర్ హైమవతి, టీచర్లు లక్ష్మీ, మీరమ్మ, సందానీ పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నిర్దేశిత లక్ష్యాలు పూర్తి చేయాలి: డీడీవో

ప్రజాశక్తి-బాలాయపల్లి: పంచాయతీ కార్యదర్శులు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని డీడీఓ వాణి రెడ్డి అన్నారు. స్థానిక సచివాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పన్నులు వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. స్వామిత్వ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి సర్వే సమగ్రంగా నిర్వహించాలన్నారు. అనంతరం పన్ను వసూళ్ల వంద శాతం పూర్తి చేసిన పంచాయతీ కార్యదర్శి బాలాజీని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఆర్‌టీసీ ఉద్యోగుల సంఘం అభ్యర్థన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రీజినల్ కమిటీ పిలుపు మేరకు తిరుపతి రీజియన్ లో 01/2019 సర్క్యులర్ అమలు కోసం చేసే పోరాటంలో భాగంగా ఆర్‌టిసి డిపో ప్రెసిడెంట్ పీడీ ప్రవీణ్ , డిపో సెక్రటరీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గూడూరు ఆర్డీవో కార్యాలయంలోని ఉద్యోగికి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జోనల్ చీఫ్ అడ్వైజర్ ఎస్ కె ఎంఅహ్మద్ ,రీజనల్ జాయింట్ అసిస్టెంట్ సెక్రటరీ శ్రవణ్ , రీజనల్ జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు సభ్యులు ప్రభాకర్, పోలయ్య, మస్తాన్, బాబు రావు, బాష పాల్గొన్నారు.

ఎంజీఆర్ ఫిజియో థెరపీ కళాశాల ప్రారంభం

ప్రజాశక్తి చంద్రగిరి: చంద్రగిరిలో ప్రారంభమైన ఎంజీఆర్ ఫిజియోథెరపీ కాలేజీ ప్రారంభోత్సవానికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని విచ్చేశారు. ఎమ్మెల్యే కి కాలేజీ యాజమాన్యం, కూటమి ప్రభుత్వ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించిన ఎంజీఆర్ ఫిజియోథెరపీ కాలేజ్ అత్యాధునిక సదుపాయాలతో చంద్రగిరిలో నిర్మించడం శుభపరిణామం అని ఎమ్మెల్యే తెలిపారు. కాలేజీ యాజమాన్యాన్ని అభినందించి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

దోమల విజృంభణ పట్టదా?

- కునుకు పట్టక ప్రజలు ఆందోళన
- కనిపించని దోమల నివారణ యంత్రం
- పట్టించుకోని మున్సిపల్ శాఖ

ప్రజాశక్తి-నాయుడుపేట: పట్టణంలోని దోమలు రాత్రనక, పగలనక విజృంభిస్తున్నాయి. కంటి మీద కునుకు కరువై ఆందోళన చెందుతున్నారు. గతంలో మున్సిపాల్టీ వారి ఆధ్వర్యంలో మురుగు గుంతల్లో దోమల నివారణ మందులు చల్లేవారు. ప్రస్తుతం మున్సిపల్ అధికారులు ప్రజల ఆరోగ్యం తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీందో దోమలు అధికమై మున్సిపల్ ప్రాంత ప్రజలు అనారోగ్యంతో ఇబ్బందులకు గురవుతున్నారు.

దోమల విజృంభణ పట్టదా?

పట్టణ ప్రజలు దోమల విజృంభణతో ఆందోళనకు గురవుతున్నారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో నివసిస్తున్న ప్రజలు దోమల బెడదను తట్టుకోలేక ఇంట, బయట ఉండలేక దోమల నివారణకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా స్వైర విహారం చేస్తుండడంతో నిద్ర పట్టక పడరాని పాట్లు పడుతున్నారు.

కునుకు పట్టక ప్రజలు ఆందోళన

దోమల నివారణ మరిచిపోయిన నాయకులు, అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెందుతున్నారు. దోమలు అధికం కావడంతో రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చంటి పిల్లలు, చిన్నారులు వున్న ఇళ్లలో తల్లిదండ్రులు తాత్కాలిక ఉపశమనంగా జెట్, మస్కిటో కాయిల్స్‌లను ఉపయో గిస్తున్నారు. అయినా దోమలు స్వైర విహారం చేస్తున్నాయని భయాందోళనకు గురవుతున్నారు.

అటకెక్కిన దోమల నివారణ యంత్రం

ఎమ్మెల్యే, నాయకులు, అధికారులు అప్పుడప్పుడు ఏదో చుట్టపు చూపుగా ఏదైనా కార్యక్రమాలు జరిగినప్పుడు మాత్రం ముఖాలు చూపించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలి అని ఊకదంపుడు ప్రసంగాలు చేసి వెళ్లిపోతున్నారని, పట్టణంలో పారిశుధ్య చర్యలు, దోమల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు వాపోతున్నారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో దోమలు దండయాత్ర చేస్తుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దోమల బెడద తాళలేక సాయంత్రం అయితే ప్రతి ఒక్కరు ఇళ్లల్లోకి వెళ్లి తలుపులు వేసుకోవడం, దోమలు ఇళ్లల్లోకి రాకుండా అనేక చిట్కాలు పాటిస్తున్నారు. కానీ దోమల వీర విహారం చేస్తుండడంతో ప్రజలు అయోమయానికిగురవుతున్నారు. దోమల నివారణకు మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. గతంలో అధికారులు దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలతో పొగను వదిలేవారు. మురుగు కాలువ ల్లో సైతం దోమల నివారణకు తగిన మందులు పిచికారీ చేసేవారు. అయితే ప్రస్తుతం దోమల నివారణ కు ఎలాంటి ఫాగింగ్ యంత్రాలు కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఫలించని మున్సిపల్ యంత్రాంగం కార్యక్రమాలు

నాయుడుపేట మున్సిపల్ కమిషనర్‌గా ఎస్‌కె పజిలుల్లా బాధ్యతలు చేపట్టిన ఒకటిన్నర సంవత్సర కాలం నుంచి నాయుడుపేట పట్టణ అభివృద్ధికి ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా పూడుక తీతలకు నోచుకోకుండా ఆక్రమణలకు గురై పట్టణంలో ఇళ్ల మధ్య పారుతున్న డ్రైనేజిలను మెరుగు పరుస్తూ కొత్త రూపులు దిద్దారు. ఇలా అనేక విధాలుగా నాయుడుపేట పట్టణానికి అనేక విధాల సేవలు అందిస్తున్నారు. పట్టణ అభివృద్ధికి పాటుపడుతున్న అధికారి ఉన్న పట్టణంలో ప్రజలు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోవడం ఆందోళన కలిగిస్తోందని యంత్రాంగం చేస్తున్న కార్యక్రమాలు దోమల నివారణకు ఎలాంటి ఫలితం ఇవ్వడం లేదని, పట్టణ అభివృద్ధితో పాటు పట్టణ ప్రజల ఇబ్బందులపై, దోమల నివారణకు సైతం చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కొత్తూరు దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వండి: సిపిఎం

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- కేవీబీపురం: కేవీబీపురం మండలంలోని కొత్తూరు గ్రామ దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్, మండల కార్యదర్శి నాగలా పురం నాగరాజులు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలా నికి బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తూరులోని దళితులు, గిరిజనులు 28 మందికి ఇంటి స్థలాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలుమార్లు తహశీల్దారు దృష్టికి తీసుకుని వెళుతున్నా ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. గత ఐదారు ఏళ్లుగా మూడు, నాలుగు కాపురాలు ఒకే కుటుంబంలో వుంటూ బాడుగుల ఇళ్లలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని లబ్ధిదారులు ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విచారించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు సిపిఎం శాఖ కార్యదర్శి వరలక్ష్మి, సుమలత, కే మంగమ్మ, అంకమ్మ, కమలమ్మ, మస్తానయ్య, వసంతమ్మ, కవిత, సుబ్రహ్మణ్యం, ప్రియా, నీలావతి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం: సీఐ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చదువులో ఉన్నత ర్యాంకులు సాధించాలని లక్ష్యంతో విద్యార్థులు క్రీడలకు దూరం అవుతున్నారని మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని ప్రతి ఒక్కరూ వారికి ఆసక్తి ఉన్న క్రీడల్లో ప్రాక్టీస్ చేస్తూ ఉన్నత స్థాయికి వెళ్లాలని గూడూరు రూరల్ సీఐ కిషోర్ బాబు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీ క్లబ్ , ది గూడూరు క్రికెట్ క్లబ్, అల్లూరు ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నమెంట్ ను రూరల్ సీఐ కిషోర్ బాబు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ కిషోర్ బాబు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని క్రీడల వల్ల శారీరక ఆరోగ్యం పెరుగుతుందని దీనివల్ల మానసికంగా ఉల్లాసంగా ఉండవచ్చని సూచించారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఏదైనా క్రీడా స్ఫూర్తితో చూడాలని పిల్లల్లో ఉన్న క్రీడా ఆసక్తిని తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు .ఈ కార్యక్రమంలో డాక్టర్ జనార్ధన్ రెడ్డి ,వెంకటేశ్వర రెడ్డి, ముని గిరీష్ , శ్రీధర్ రెడ్డి, బాలకృష్ణంరాజు , అనిల్ , పివి కృష్ణయ్య, సురేందర్ రెడ్డి ,లవ కుమార్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామంపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యా లయానికి చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టరు పి సంధ్య సారథ్యంలో ఈ నెల 24వ తేదీ వేదాంతపురం గ్రామంలో ప్లాస్టిక్ రహిత గ్రామంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలు, ప్లాస్టిక్ కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణహిత పదార్థాల వినియోగం అవసరమని నినాదాల ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమానికి మోడల్ ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ కె. హరిబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు హాజరై కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణకు అవకాశం కల్పించినందుకు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి ఉమకి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ రజనికి, ఎన్ఎస్-ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ లలిత కుమారికి ఎన్ఎస్ఎస్ యూనిట్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సౌత్ జోన్ యూత్ ఫెస్టివల్‌లో ఎస్వియు ఛాంపియన్

ప్రజాశక్తి - క్యాంపస్ : చెన్నైలోని హిందూస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఇటీవల నిర్వహించిన 39వ సౌత్ ఇండియన్ యూత్ ఫెస్టివల్- 2025 లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచి ఫైనాట్స్ క్యాటగిరీలో ఓవరాల్ ఛాంపియన్ ను కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో రాణించి వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు, రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు అభినందనలు తెలిపారు. విశ్వ విద్యాలయం నుంచి పాల్గొన్న విద్యార్థులు వివిధ విభాగాల్లో రాణించారు. బహుమతులు పొందారు. ర్యాలీలో నాల్గవ స్థానం రాగా, ఫోక్, ట్రైబల్ డాన్స్ లో మూడవ స్థానం, వాద్ వివాద్ (హిందీ వక్తృత్వం)లో నాలుగో స్థానంలో నిలిచారు. క్లాసికల్ పెర్క్యూసన్‌లో మూడో స్థానాన్ని కె ప్రతీప్ పొందారు. క్లే మోల్డింగ్ లో కె తేజ మొదటి స్థానం, రంగోలీలో ఎం వీరాంజనేయులు మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. విద్యార్థులను సమాయత్తం చేసి, వారిని ఈ నెల 19 నుంచి 23 వరకు చెన్నైలో వివిధ పోటీల్లో పాల్గొనేలా పర్యవేక్షించిన ఎస్వీయూ కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్‌ను విశ్వవిద్యాలయం అధికారులు అభినందించారు.

ఇంటి పట్టాలు మంజూరు చేయండి

తహశీల్దారుకు ముసల్ల గుంట వాసుల వినతి

ప్రజాశక్తి -నాగలాపురం: నాగలాపురం పంచాయతీ కార్యాలయ సమీపంలో మొసల్లగుంట (అగర్తి) లో వేద నారాయణస్వామి ఆలయం చుట్టూ నివాస ముంటున్న వాళ్లకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కోట వీధివాసులు తహశీల్దార్ హనుమాన్ నాయక్ కు బుధవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో వేదనారాయణ స్వామి దేవాలయం చుట్టూ గత 40 సంవత్సరాలుగా నివసిస్తు న్నారని, గ్రామస్తులకు అవసరాల నిమిత్తం, దేవాదాయ మాడవీధులు అభివృద్ధికి 1981లో అప్పటి టీటీడీ ఈవో పివి ఆర్ కె . ప్రసాద్, అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ అవసరాలు వదిలిపెట్టి భూమిలో భాగంగా దేవాలయం చుట్టూ నివసించిన వారికి భూములు కేటా యించారని అందులో భాగంగా గ్రామకంఠం సర్వే నెంబర్ 936/బి/4 కు సంబంధించిన ముసళ్ళ గుంట (అగర్త) ప్రాంతంలో 1391 పసలి ప్రకారం అప్పటి కలెక్టర్ ఆదేశాలతో సత్యవేడు ఎమ్మార్వో సర్వే నెంబర్ 969/బి/78 లో ఆలయం చుట్టూ నివసిస్తున్న కొంతమందికి పట్టాలు మంజూరు చేశారన్నారు. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూములు దేవాలయం చుట్టూ నివసించిన వారికి నివాస అవసరం కోసం కేటాయిం చినవే అని, ఆ సమయంలో టిటిడి అధికారులు, ప్రభుత్వం అక్కడ మౌలిక వసతులు కల్పించకపోవడంతో అప్పట్లో నివాసలు ఏర్పాటు చేసుకోలేకపోయారు. అప్పటి నుంచి ఆ భూములు బీడు భూములుగా ముళ్ల పొదలు ఎవరూ వెళ్లలేని పరిస్థితిలో ఉన్నందున, ఇప్పుడు ఆ భూమిపై కొంతమంది వారి అవసరాల కోసం చదును చేసి ఈ భూమి తమకే సొంతమని నకిలీ దస్తావేజులు సృష్టించారు. ఇకనైనా ప్రభుత్వ అధికారులు, టీటీడీ అధికారులు ఆ భూములను కాపాడి ఆలయం చుట్టూ ఉంటున్న పేద ప్రజలకు పంచి ఇవ్వాలని కోరుకుంటున్నామన్నారు. ఈ విషయంపై తహశీల్దారు సానుకూలంగా స్పందించి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని టూటౌన్ సిఐ నాగార్జున రెడ్డి, స్థానిక గిరిజన బాలికల గురుకులం విద్యార్థినులకు శ్రీకాళహస్తి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చట్టాలు-హక్కులతో పాటు రోడ్డు భద్రతా నియమాలు, పోక్సో, ఉమెన్ సేఫ్టీ, సైబర్ సెక్యూరిటీ, డ్రగ్ అబ్యూజ్, శక్తి యాప్‌ల గురించి అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, హింస, అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జ్యోతి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ నాగార్జునరెడ్డి

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-వాకాడు: వాకాడు మండల కేంద్రమైన వాకాడు ఎస్ఏఎల్‌సిఈఎఫ్ ప్రభుత్వ పాఠశాలలోని పదవ తరగతి చదువుతున్న పిల్లలకు మండల టిడిపి కన్వీనర్ దువ్వూరు మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా విజయ దీపికా స్టడీ మెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆ పార్టీ కన్వీనర్ దువ్వూరు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విడుదల చేసిన పదవ తరగతి మెటీరియల్‌లను చదువుకుని జిల్లాలో ఉన్నత మార్కులు సాధించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సాయిప్రసాద్, తహశీల్దారు సయ్యద్ ఇక్బాల్, ఎంఈఓ లు ఆనంద్, నసీం అలీ, ప్రధాన ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.

సహకార బ్యాంకు ప్రజలందరిది..

సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ యాదవ్

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: బిఎన్ కండ్రిగ మండలం సహకార సంఘం ఆధ్వర్యంలో కాటూరులో నిర్వహించిన రైతుల ఆత్మీయ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ 'బ్యాంకు ఏ ఒక్కరిది కాదని ఇది ప్రజలది అని, రైతుల అభివృద్ధే లక్ష్యంగా సహకార బ్యాంకులు పనిచేయాలన్నారు. రైతులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని పెద్ద రైతులు వారికి అవసరమైన రుణాలకు ఒక ఎకరాకు మూడు లక్షల రూపాయలు అందిస్తారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులందరికీ మంచి చేకూరుతుందని అగ్రికల్చర్ అధికారి కే షణ్ముగం యూరియా కొరత లేకుండా అందరికీ అందుబాటులో తెచ్చారన్నారు. సత్యవేడు నియోజకవర్గ కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కార్యక్రమంలో టిడిపి ముఖ్య నాయకులు, మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, సింగిల్ విండో డైరెక్టర్ మధు నాయుడు, ఎంపీటీసీ, మనోహర్ నాయుడు, కార్తీక్ నాయుడు, చెరుకూరి ముని చంద్ర నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ యాదవ్

ఇస్రోకు శ్రీసిటీ ఎండీ అభినందనలు

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: ఎల్‌విఎం3-ఎం6 రాకెట్ ప్రయోగం విజయవంతం అయినందుకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రయోగం ద్వారా అమెరికాలోని ఏ ఎస్ టి స్పేస్ మొబైల్ సంస్థకు చెందిన బ్లూబర్డ్ బ్లాక్-2 అతి పెద్ద వాణిజ్య కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని తక్కువ భూకక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టినందుకు ఇస్రో చైర్మన్ డాక్టరు వి నారాయణన్, షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్, ఇతర షార్ శాస్త్రవేత్తలు, ఉద్యోగులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

క్రైం న్యూస్

ఎర్రచందనం పట్టివేత

ముగ్గురు స్మగ్లర్లు అరెస్ట్

ఫారెస్టు అధికారుల అదుపులో ఎర్రచందనం స్మగ్లర్లు

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: అటవీ క్షేత్రాధికారి ఎన్ వెంకటరమణకు అందిన రహస్య సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి నిర్వహించిన దాడిలో రూ.తొమ్మిది లక్షలు విలువ చేసే ఆరు ఎర్ర చందనం దుంగలను పట్టుకున్నారని తెలిపారు. బుధవారం విలేకరు లకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 23వ తేదీ మంగళవారం రాత్రి పింఛా పరిసర ప్రాంతాల్లో ఎర్రచందనం అక్రమంగా రవాణా చేస్తున్నారని తను సిబ్బందితో కలిసి ఉస్తికాయల పెంట, ఎలమంద రోడ్డు మార్గంలో నిఘా వేశామని, వేగంగా కారు వెళ్లడంతో కారును వెంబడించగా భాకరాపేట -పీలేరు రోడ్డు మార్గంలో కారును వదిలేసి స్మగ్లర్లు పారిపోవడానికి ప్రయత్నించారన్నారు. పారిపోతున్న వారిని చుట్టుముట్టి ముగ్గురు తమిళ స్మగ్లర్లను పట్టుకున్నామని పేర్కొన్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లు తమిళ నాడుకు చెందిన తంజీయప్పన్, కార్తీ చిన్నస్వామి, పి కుమార్‌లను అదుపులోకి తీసుకున్నామని అధికారులు పేర్కొన్నారు. పారిపోయిన స్మగ్లర్ల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్ఓ మునస్వామి నాయక్, ఎఫ్‌బిఓలు లక్ష్మీ ప్రసాద్, సదాశివయ్య, రవి, డ్రైవర్ శంకర్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

నేడు కూరపాటి శంకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో గురువారం ఉదయం టిడిపి కార్యాలయంలో సత్యవేడు కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలో కార్యక్రమాల కమిటీ కోఆర్డినేటర్‌గా సేవలందిస్తూ, పార్టీ సంస్థాగత బలోపేతానికి తోడు, సత్యవేడు నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధికి దిశానిర్దేశం చేస్తున్న కూరపాటి శంకర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి మండల అధికారులు, ప్రజా పతినిధులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ తెలిపారు.

తిరుపతి పార్లమెంట్
టిడిపి అధికార ప్రతినిధిగా కుంచం దయాకర్

ప్రజాశక్తి- వాకాడు, కోట: తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి టిడిపి అధికార ప్రతినిధిగా కుంచం దయాకర్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ అధికార ప్రతినిధి పదవి తనకు దక్కడానికి నిరంతరం కృషి చేసి, పూర్తి సహకారం అందించిన గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్‌కి కుంచం దయాకర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం భవిష్యత్తులో మరింత అంకితభావంతో పనిచేస్తానని ఆయన తెలిపారు. టిడిపి సిద్ధాంతాలను ప్రజల్లో మరిం త బలంగా తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని, తిరుపతి పార్లమెంట్ పరిధిలో పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై గట్టిగా పోరాడతానని దయాకర్ వెల్లడించారు.

శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి -కోట : కోట బ్రాంచ్ శ్రీ చైతన్య విద్యాసంస్థలో సీ3 స్టూడెం ట్ పి మితిలేష్ జాతీయ స్థాయిలో నిర్వహించిన చద రంగం పోటీలో క్యాష్ ప్రైస్ 10 వేలు, అండ్ గోల్డ్ మెడల్ సాధిం చారు. పూర్వం నిర్వహించిన చదరంగం పోటీలలో కూడా అత్యున్నత ప్రతిభ కనబరిచాడు. తన ప్రతిభకి కారణం తల్లిదండ్రులు ఉపాధ్యాయులు అని విద్యార్థి మితిలేష్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏ జి ఎమ్ నర్రా శ్రీకాంత్, ఆర్ ఐ కే శ్రీనివాసులు ప్రిన్సిపాల్ గోనుచిరంజీవి, జోనల్ డిన్ ఇంగిలాల శివయ్య, సీ బ్యాచ్ ఇంచార్జ్ ముద్ద వేణుగోపాల్, జోనల్ పిఈటి ఠాగూర్ బృందం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు.ఈ కార్యక్ర మంలో ప్రైమరి ఇంచార్జి హరిత, ప్రీ ప్రైమరి ఇన్‌చార్జి వినీలా, విద్యార్థి తల్లిదండ్రులు పి నరేష్ ఉన్నారు.

మహిళల సహకారంతోనే ప్రకృతి వ్యవసాయం సుస్థిరం

డీఆర్‌డీఏ పీడీ టిఎన్ శోభన్ బాబు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: గ్రామీణ ప్రాంతాలలో మహిళల సహకారంతోనే ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేసి సుస్థిరతను సాధించవచ్చుని తిరుపతి జిల్లా డిఆర్డీఏ పీడీ టిఎన్ శోభన్ బాబు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ సాధికార సమితి, సెర్ప్, మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సాధికార సమితి జిల్లా అదనపు మేనేజర్ పట్టాభి రెడ్డి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఎన్ మురళీమోహన్ (చినబాబు) ప్రసంగించారు. మండల టిడిపి అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయానికి సేంద్రీయ ఎరువులు, కషాయాలు వినియోగించాలని రసాయనిక ఎరువులను విస్మరించాలన్నారు. ఆర్‌వైఎస్ఎస్ స్టేట్ కోఆర్డినేటర్ మనోజ్ ప్రసంగించారు. మండలాన్ని మొదట స్థానంలో నిలపడానికి కృషి చేయాలన్నారు. ఎస్ఐ భక్తువత్సలం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగుకు మహిళలు నడుంబిగించాలని కోరారు. బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, అత్యాచారాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వి మార్కొండ నాయుడు, వ్యవసాయ అధికారిణి బి మమత, ఏపిఎం గురుమూర్తి, సీసీలు సుధాకర్, అరుణ, ఆర్ వై ఎస్ ఎస్ సిబ్బంది, మహిళా రైతులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: రైతులు ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసే పంటలతోనే అధిక లాభాలు సాధించవచ్చునని ఎంపీడీఓ నారాయణ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో విఓఏలు, సంఘబంధం సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం లో పెట్టుబడులు తగ్గించుకుని తక్కువ ఖర్చులతోనే అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా స్థిరపడే అవకాశాలు ఉన్నాయన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారిణి విజయ లక్ష్మి మాట్లాడుతూ ద్రవజీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం, కాషాయాలు వాడకం గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో ఏపీఎం కిరణ్, ఎన్ఎమ్ఎఫ్ శివశంకర్, సౌందర్యబాబు, పెంచలయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS, TIRUPATI
I.A. No. 26/2025, ARC.No. 112/2025
M/s Margadarsi Chit Fund Pvt. Ltd., Tirupati
Rep.by its Manager/Foreman ..Petitioner/Disputant
V/s
Mr.R.D.A.Bharath Kumar & Others
..Respondents/Opponents
IA & Dispute Notice to Opponents 1 & 4
Opp.No.1) Mr.Reddy Dharmappan Anandan Bharath Kumar, S/o.R.D.Anandan, aged 36 Years, H.No.11-4-44, Sri Ramar Koil Street, Chinthalapatteda, Nagari, Chittoor District-517590. (Business Address: Bricks Trading Business, #11-4-44, Sriramar Koil Street, Chinthalapatteda, Nagari, Chittoor District - 517590).
Opp.No.4) Mrs. Puttur Govindhaswamy Srinivasan Sumathi, W/o.R.D.A.Bharath Kumar, aged 33 Years, H.No.11-4-44, Sri Ramar Koil Street, Chinthalapatteda, Nagari, Chittoor District-517590. (Joint Property Holder, Parvatharajapuram, Iruguvai Grama Panchayathi, Nindra (M), Chittoor District - 517590).
Please take notice that the above Dispute is posted to 03-01-2026 for your appearance before the above said Honourable District Registrar/ Arbitrator Office, Tirupati at 10:30 A.M., either in person or through an Advocate and raise your objections if any, failing which the case will be decided in your absence as exparte.
Hearing Date : 03-01-2026
K.RAMESH BABU
Advocate, Tirupati. Cell No. 9440095932

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS, VELLORE DISTRICT CHIT FUND CASES COURT, DISTRICT REGISTRAR OFFICE, VELLORE-632001
ARC.No. 32/2025
M/s Margadarsi Chits Private Limited. 29/B, 2nd Floor, Jambu Bala Complex, Arcot Road, Vellore-632004 ...Petitioner/Disputant
V/s
Mrs. V.Dhanamma and others
..Respondents/Opponents
D2) Mr.S.Kumar, S/o Mr.S. Venkata Krishnaiah Add: S.G. Teacher, M.P. P. School, Bheemavaram (V), Sri Kalahasthi (M), Tirupati District. Pin - 517 102, Andhra Pradesh State.
D3) Mr.S.Sivasankaraiah, S/o Mr.S.Ramanjan Add: Sr. Tech., (MECH), 0/0 S.S.E/C&W, S.C. Raiway, Tirupati-517 501, Andhra Pradesh State.
D4) Mr.V.Sathish Kumar, S/o Mr. V.Rajeswara Rao, Add: Junior Assistant, Z. P. High School, Chinthavaram, Chillakur (M), Tirupati District, Pin-524 412, Andhra Pradesh State.
D6) Mr.K.Jagadeesh Kumar, S/o Mr.K. Veeraachari, Add: T.C.M-III, Dept. of SNT, O/o S.S.E/S&T, South Central Railway, Tirupati -517 501, Andhra Pradesh State.
D7) Mr.Sugali S Naik, S/o Mr.S.Nani Naik, Add: Sr. Tech (MECH), Dept. of Mechanical, O/o S.E (C& W), South Central Railway, Tirupati-517 501, Andhra Pradesh State.
The Petitioner has filed the above suit to recover a sum of Rs.5,37,030/- With interest towards the Arrears of Chit sunscription. The above said petition was posted to **06/01/2026** at 11 A.M. for enquiry, it you got any object you may appear before this Honourable Forum either in person or through an advocate and file your objections. If you fail to do, so the matter will be decided exparte.
M.BALASUBRAMANIAM
ADVOCATE FOR PETITIONER VELLORE

In the Court of the Principal Senior Civil Judge of Tirupati
O.E.P.No.6/2025, O.S.No.97/2012
Vepamakula Sreenatha Reddy
...Petitioner/D.Hr
V/s
Pedda Gurdreddi Rajasekhar Reddy
...Respondents/J.Dr
U/o 21 Rule 37 CPC Notice to J.Dr
Pedda Gudreddi Rajasekhar Reddy S/o Late Reddeppa Reddy, Landlord & Business, D.No.20-1-416-16D, Subash Nagar, Tirupati Town & District.
పై E.P. నందు తేది. 24.06.2013 తేదీన కోర్టువారు ఇచ్చిన డిక్రీని అమలుపరచుటకు గాను J.Dr అయిన నీపై అరెస్ట్‌కు D.Hr వేసియున్నారు. సదరు J.Dr అయిన నీవు ఎందుకు నిన్ను అరెస్ట్ చేయ కూడదో తెలియజేయుటకు గాను తేది. 21.01.2026 కి కోర్టువారు వాయిదా వేసియున్నారు. సదరు తేదీన J.Dr అయిన నీవు పై కనిన కోర్టుకు ఉదయం 10.30 గం॥లకు నేరులోగాని లేక వకీలు ద్వారా హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలసినది. లేనియెడల పరోక్షముగా తీర్మానించబడును.
వాయిదా తేది. 21.01.2026
జి.సుధీర్ కుమార్ రెడ్డి
గుండ్రె చరిత రెడ్డి
D.Hr తరపు న్యాయవాదులు, తిరుపతి

IN THE COURT OF ADDL CIVIL JUDGE (JUNIOR DIVISION) - CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE:: PUTTUR
I.A. NO. 83/2025
O.S.No. 12/2024
Between:-
S.S.Giri **...Petitioner**
And:-
Sandala Bhaskar
...Respondent/Defendant
NOTICE TO THE RESPONDENT
Sandala Bhaskar S/o S.Singaraiah, residing at Door No.18-8-49/7, Maduranagar, Thirupathi town & Post, Thirupathi Urban Mandal, Thirupathi Dist.,
Please take notice that, the petitioner/ plaintiff filed the above final decree petition against you in the above Hon'ble court and the above petition is posted to 19/01/2026 for your appearance. So, please to be attend on 19/01/2026 at 10-30 A.M. before the above Hon'ble court either in person or through your advocate, failing which the matter will be decided exparte against you on your absence.This is the order of the above Hon'ble court.
Date of hearing: 28-06-2024.
(BY ORDER OF THE HON'BLE COURT)
Sd/- N.MURUGESHAN REDDY
ADVOCATE ,PUTTUR
Cell-9346628144

మహరాజ రాజశ్రీ తిరుపతి సివిల్ జడ్జి ప్రిన్సిపల్ సీనియర్ డివిజన్ వారి కోర్టులో
ఐ.ఎ.నెం.302/2024, ఓ.ఎస్.నెం.49/2016
జంగం నాగూర్ రావు (డైడ్)
rep by జంగం దుర్గ మరియు ఇతరులు ...వాదులు
V/s
జంగం సుబ్రమణ్యం మరియు ఇతరులు ..ప్రతివాదులు
పై దావాలో 8వ ప్రతివాదికి దావా సమన్సు/నోటీసు
పై దావాలో వాదులు ప్రతివాదులపై వ్యాజ్యం వేసియున్నారు. సదరు దావాలో 8వ ప్రతివాది అయిన బి.వెంకటేష్ తండ్రి మునీంద్రబాబు వ్యాపార జీవనం డి.నెం.475 డి-టైపు క్వార్టర్స్ వినాయక నగర్, ఇస్కాన్ గుడి ప్రక్కన తిరుపతి, తిరుపతి జిల్లా అను నీవు హాజరు కొరకై పై కోర్టువారు 06.01.2026న వాయిదా వేసియున్నారు. కావున ఉ॥ 10.30 గం॥లు మీరుగాని మీ తరపు న్యాయవాది గానిపై తారీఖున పై కోర్టుయందు హాజరై మీ అభ్యంతరములు తెలుపవలెను. మీరు హాజరు కాని యెడల సదరు కోర్టువారు మీకు ప్రతికూలముగా లేదా పరోక్షముగా నిర్ణయం తీసుకోబడును.
చిట్టి రెడ్డెప్ప అడ్వకేట్,
నెం.8-18, 1వ ఫ్లోర్, రాయల్ నగర్, ఆర్.సి.రోడ్డు, తిరుపతి. సెల్: 9700752082, 9885594158

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT:HYDERABAD
O.S.NO.2313 OF 2024
Between:
Union Bank of India, (erstwhile Andhra Bank merged in UBI) Credit Card Division, Koti, Hyderabad, represented by the Manager
...Plaintiff
And
Sri Aluru Sanjeeva Rayudu, S/o. Late Sri A.S.Rayudu, aged 49 years, Occ: Hotel Business, Aluru Residency, R/o. # 6-1-173, Varadaraja Nagar, K T Road, Tirupati, Andhra Pradesh- 517501
...Defendant
The plaintiff filed the above numbered suit against you, for recovery of Rs.2,58,774.50ps. (Rupees Two Lakhs Fifty Eight Thousand Seven Hundred Seventy Four And Paise Fiftyonly) together with subsequent interest @2.95% per month compounded monthly and service charges from date of suit till realization and costs and the same stands posted to **08-01-2026** for your appearance in person or through duly appointed Advocate at **10-30**A.M and if you fail to so appear, the matter will be decided on merits, in your absence.
(BY ORDER OF THE COURT)
Sd/- (S.VIKRAMADITYA BABU)
Counsel for the Plaintiff
H.No.16-11-16/T/5, West Prasanthnagar Colony, Moosarambagh, Hyderabad-500 036

ఘనంగా ఎంజీఆర్ వర్ధంతి

ప్రజాశక్తి -పిచ్చాటూరు: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్(ఎంజీఆర్) 38వ వర్ధంతిని పిచ్చాటూరు మండలం కీలపూడి గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మురుగన్ నాడార్, పిచ్చైమణి కుటుంబ సభ్యులు గత 38 సంవత్సరాలుగా ఎంజీఆర్ అభిమాని అయిన పిచ్చై మని భర్త మురుగన్ నాడార్ ఎంజీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్య క్రమంలో మహేష్, కామరాజ్, సుందరం పాల్గొన్నారు.

దక్షిణ భారత సైన్స్‌ఫేర్‌కు పాకాల విద్యార్థి

ప్రజాశక్తి - పాకాల: పాకాల మండలం ఓబుల్ శెట్టి వారి పల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న రాజశేఖర్ అగ్నిమాపక దళంలో రోబో ఎలా పనిచేస్తుందో వర్కింగ్ మోడల్‌ను విజయవాడ సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించారు అక్కడ రాష్ట్ర స్థాయిలో 10 ఉత్తమ ప్రాజెక్టులలో ఒకటిగా ఎంపికై దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక కావడం చాలా హర్షణీయం, అభినందనీయం అని పలువురు విద్యార్థి రాజశేఖర్ ను, గైడ్ టీచర్ మాధవికి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమార్ రెడ్డికి అభినందనలు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు కె బాబ్జి, యన్ లింగయ్య యుటిఎఫ్ సంఘ నాయకులు, ప్రముఖ కవి పత్తిపాటి రమేష్ నాయుడు , ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ రఫీ, సుమలత సుమతి పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

వినూత్న పరిశోధనలకు విశేష గుర్తింపు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని అప్లైడ్ మైక్రోబయాలజీ విభాగంలో ప్రొఫెసర్ చండీ కుమారి మార్గదర్శకత్వంలో పని చేస్తున్న సబీహా తబస్సుమ్ కొక్కంటికి యంగ్ సైంటిస్ట్ అవార్డు లభించింది. అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మసీ 19వ వార్షిక సదస్సుతో పాటు, సస్టైనబుల్ డెవలప్‌మెంట్ కోసం హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, అగ్రికల్చర్, బయోమెడికల్ సైన్సెస్‌తో సాంకేతికతను సమగ్రపరచడంపై ప్రతిష్టాత్మక గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో ఈ గౌరవం లభించింది. సూక్ష్మజీవుల ద్వారా ఖైటోసనేస్ ఎంజైమ్ ఉత్పత్తి, ఆప్టిమైజేషన్ పై ఆమె చేసిన పరిశోధనకు గుర్తింపుగా ఈ అవార్డును అందించారు. ఈ సూక్ష్మజీవుల విధానం, క్రస్టేషియన్ వ్యర్థాల నుండి ఉద్భవించిన జీవపాలిమర్ అయిన చ ఖైటోసాన్‌ను విలువైన బయోయాక్టివ్ ఖైటో ఆలిగోసాకరైడ్‌లుగా మార్చడానికి, "వ్యర్థాల నుండి సంపద అభివృద్ధి" సూత్రాలను కలిగి ఉంటుంది. ఈ అవార్డు ఆరోగ్య సంరక్షణ మరియు వ్యర్థ పదార్థాల నిర్వహణలో స్థిరమైన ఆవిష్కరణలను నడపడానికి సూక్ష్మజీవుల బయోటెక్నాలజీ సామర్థ్యాన్ని నొక్కి చెబుతుంది. బయోటెక్నాలజీ , ఫార్మసీ అసోసియేషన్ ప్రధాన లక్ష్యం బయోఫార్మాస్యూటికల్స్, స్థిరమైన అభివృద్ధి, మానవ ఆరోగ్యం, సామాజిక ప్రయోజనాల కోసం అనువాద పరిశోధన వంటి రంగాలలో ఆవిష్కరణలను పెంపొందించడంపై దృష్టి పెడుతుంది. ఈ అంతర్జాతీయ వేదికపై సబీహా తబస్సుమ్ గుర్తింపు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి గొప్ప గౌరవాన్ని తెస్తుందని, ఆమె పరిశోధన ప్రపంచ ప్రభావాన్ని చెబుతుందని పలువురు పేర్కొన్నారు.

ప్రతిభ అద్భుతం

- వెంకటగిరి ఖ్యాతిని పెంచారు..
- అంధ క్రీడాకారుల కృషికి ఎమ్మెల్యే ప్రశంస

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: ఇటీవల రాజస్థాన్ రాష్ట్రంలోని శ్రీ గంగానగర్‌లో నిర్వహించిన '14వ జాతీయ అంధుల జూడో ఛాంపియన్ షిప్' పోటీలలో సత్తా చాటి పతకాలు సాధించిన ఆంధ్రప్రదేశ్ క్రీడాకా రులను వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఘనంగా సన్మానించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యా లయంలో బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులను, విజేతలను బుధవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజస్థాన్‌లో నిర్వహించిన జాతీయ పోటీలలో 'ఆంధ్రప్రదేశ్ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మన రాష్ట్ర క్రీడాకారులు అద్భుత ప్రతిభ చూపించారన్నారు. మొత్తం 11 మంది క్రీడాకారులు పాల్గొనగా.. 1 బంగారు పతకం , 6 వెండి పతకాలు, 2 కాంస్య పతకాలు సాధించడం మన రాష్ట్రానికి గర్వకారణం అన్నారు. ఈ అసోసియేషన్ వ్యవస్థాపకులు, అంతర్జాతీయ క్రీడాకారుడు ముప్పాళ్ళ శేషగిరి మన వెంకటగిరి నియోజకవర్గానికి చెందిన వ్యక్తి కావడం తనకు ఎంతో సంతోషాన్ని గర్వాన్ని ఇస్తోందన్నారు. అంధత్వాన్ని జయించి, క్రీడల్లో రాణిస్తూ పది మందికి ఆదర్శంగా నిలుస్తున్న వీరిని అందరం ప్రోత్సహించాల్సిన అవసరం వుందన్నారు. భవిష్యత్తులో మంత్రి నారా లోకేష్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, అంధ క్రీడాకారులకు ప్రభుత్వం తరపున మరింత సహకారం అందేలా కృషి చేస్తానని తెలిపారు.

రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణ పరిశీలన

ప్రజాశక్తి-రామచంద్రపురం : శ్రీ వాణి ట్రస్ట్, సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని టిటిడి పాలకమండలి ఛైర్మన్ బి ఆర్ నాయుడు బుధవారం పరిశీలించారు. మండలంలోని గణేశ్వర పురం పంచాయతీ లక్ష్మీపురం ఏ ఏ డబ్ల్యూ గ్రామంలో నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ సందర్శనకు విచ్చేసిన టిటిడి ఛైర్మన్ బి ఆర్ నాయుడు కి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవాణి ట్రస్ట్ దాతల సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానం దేశవ్యాప్తంగా 5వేల దేవాలయాలను నిర్మింప చేస్తుందని తెలిపారు. దేశవ్యాప్తంగా గ్రామాలలో హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా గ్రామాలలో దేవాలయాల నిర్మాణానికి టిటిడి రూ. 5 లక్షల నుండి 20 లక్షల వరకు నిధులు ఇస్తామని ఆయన తెలిపారు. టిటిడి శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐదువేల దేవాలయం నిర్మిస్తామన్నారు. శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో మా గ్రామంలో నిర్మించిన ఆలయానికి ధూప దీప నైవేద్యాలకు, ఉత్సవాల

సమావేశంలో మాట్లాడుతున్న టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు

నిర్వహణకు అన్ని విధాల సహకరించాలని గ్రామస్తులు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు ని కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ ఆలయ అభివృద్ధికి అన్ని విధాల సహకరించి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అమ్మవారి దేవాలయానికి గొడుగులు, సౌండ్ సర్వీస్, కావాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ ప్రతినిధులు, టిటిడి సిబ్బంది, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మురుగు మధ్యే చదువులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మురుగునీటి ప్రవాహం పక్కనే విద్యార్థినులు విద్యను అభ్యసిస్తూ నానా అవస్థలు పడుతున్నారు. కనీస మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈపాఠశాల ప్రాంగణంలో కాలువలు లేకపోవడంతో మురుగునీరు ప్రవహిస్తుండగా ఆ పక్కనే విద్యార్థినులు కూర్చుకొని పరీక్షలు రాయాల్సిన పరిస్థితి. పాఠశాలలో ఉన్న మరుగుదొడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నట్లు గతంలో మీడియా ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చర్యలు చేపట్టలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాగునీటి

మురుగు పక్కనే కూర్చొని చదువుకుంటున్న విద్యార్థినులు

ట్యాంకు వద్ద పైపులు సరిగా అమర్చకపోవడంతోపాటు వ్యర్థాలు స్కూలు మధ్యగా ప్రవహించి మురుగు కాలువగా మారాయి. ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం పాఠశాలను సందర్శించి 247మంది ఉండగా 207మంది విద్యార్థినిలు హాజరయ్యారని గుర్తించారు. మరుగుదొడ్లపై ఉన్నతాధికారులకు నివేదిక పంపి త్వరలో మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. మురుగునీటి కాలువ పక్కనే చదువుకోవాల్సి వస్తోందని, స్టడీ అవర్స్ సమయంలోనూ తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. పైపులు అమర్చి మురుగునీరు బయటకు వెళ్లేలా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిడిఓ

రేపు 'నాగేటి తడి' గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని సెనేట్ హాల్లో శుక్రవారం యస్వియూ విశ్రాంత ఆచార్యుడు నాగోలు కృష్ణారెడ్డి రాసిన దీరకవితా సంపుటి 'నాగేటి తడి' దీరకవిత పుస్తకాన్ని యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఆవిష్కరించనున్నారు. ఉపన్యాసకులుగా ఆచార్య కిరణ్ క్రాంత్ చౌదరి, భూమన్ పాల్గొంటారు. తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యులు మేడిపల్లి రవికుమార్, యోగి వేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు ఈశ్వర రెడ్డి పుస్తక సమీక్షను చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని యస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థ నిర్వహిస్తోంది.

మోడల్ ప్రైమరీ పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి- తడ : రాష్ట్ర స్థాయి విద్యా శాఖాధికారి జాయింట్ డైరెక్టర్ (జే డి సెర్వీసెస్) అబ్రహం వేనాడు లోని మోడల్ ప్రైమరీ పాఠశాల ను సందర్శించారు. సందర్శనలో భాగంగా పాఠశాల పిల్లల సామర్థ్యాలను, పాఠశాల రికార్డులు అలాగే ముఖ్యంగా పరీక్షల అసెస్మెంట్ బుక్స్, పిల్లల రాత పుస్తకాలు పరిశీలించారు. పాఠశాల వసతులైన టాయిలెట్స్, వంటగది, తరగతి గదులు, కాంపౌండ్ వాల్, ఆట స్థలము, మిగిలిన పరిసరాలను పరిశీలించారు. జే డి వెంట కే జే వేములు, యం ఈ ఓ-1, కే మల్లికార్జున రావు యం ఈ ఓ -2, సులూరుపేట ఎంఈఓ 2 శీనయ్య ,యం మునీష్ కుమార్, సి ఆర్ యం టి ఉన్నారు. వీరితోపాటు గ్రామ పెద్దలు సుదర్శన్ మొదలియార్ పాఠశాలకు వచ్చి జే డీ నియూ పి స్కూల్ చేయాలని కోరుతూ ఇక్కడి విద్యార్థులు 6 ,7 ,8 తరగతులు బయటికెళ్లి చదవలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

28న రతన్‌టాటా జయంతి వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) సేవాతత్పరులు, ప్రముఖ సంఘసంస్కర్త రతన్ టాటా జయంతి వేడుకలను తిరుపతి నగరంలో ఈ నెల 28న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ శ్రీ రతన్ టాటా సేవా సమితి ఛైర్మన్ పి.తేజ తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఆర్‌పల్లి నుండి లక్ష్మీపురం కూడలి వరకు ర్యాలీ, రక్తదానం, పండ్లు పంపిణీ, అన్నదానం, సాయంత్రం అన్నమయ్య సర్కిల్ దగ్గర సాంస్కృతిక కార్యమాలను నిర్వహిస్తామన్నారు.

రబీపై జిల్లాస్థాయి శిక్షణ

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): చిత్తూరు వారి కార్యాలయంలో బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో వ్యవసాయ ఈ పంట రబీ 2025-26 జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి మాస్టర్ ట్రైనర్లు రబీ 2025-26లో ఈ పంట నమోదులో పాటించవలసిన మార్గానిర్దేశకాలు, జాగ్రత్తల గురించి జిల్లాలోని సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో ఉపదేశించిన మార్గానిర్దేశకాలను అనుసరించి ఈ పంట నమోదును చేయవలసినదిగా జిల్లా వ్యవసాయ అధికారి, చిత్తూరు వారు క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమములో వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నష్టపరిహారం పొందే హక్కు..

ప్రజాశక్తి -విజయపురం (నగరి): నష్టపరిహారం పొందే హక్కు వినియోగదారునికి ఉందని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ తెలియజేశారు. బుధవారం కళాశాలలో కన్స్యూమర్ క్లబ్ విభాగం ఏర్పాటుచేసిన జాతీయ వినియోగదారుల దినోత్సవం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఆన్‌లైన్ వ్యాపారాలు ఎక్కువయ్యాయన్నారు. నమ్మకమైన, ప్రభుత్వ గుర్తింపు పొందిన వెబ్సైట్స్ ద్వారానే ఆన్లైన్లో వస్తువులను, సేవలను పొందాలని, లేదంటే మోసపోయే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. వినియోగదారుడు కాని వ్యక్తి ఉండరని కావున జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో వినియోగదారుల కోర్టుల గురించి, వాటి విధి, విధానాల గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. వినియోగదారుల కోర్టులు సులభమైన విధివిధానాలను అవలంభిస్తాయని స్వయంగా మన కేసును మనమే వాదించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ధర, నాణ్యత, పరిమాణం విషయంలో వినియోగ దారులు నష్టానికి, మోసానికి గురికాకుండా చట్టం మనకు రక్షణ కల్పిస్తుందన్నారు. ఐక్యూ కోఆర్డినేటర్ రామాంజులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గోపి, జేకేసీ మెంటార్ లాల్‌బాషా, అధ్యాపకులు హరికృష్ణ, కిరణ్‌కుమార్, జ్యోతి పాల్గొన్నారు.